PLATINUM JUBILEE YEAR
Visit Internet Edition @ www.jaminryot.com

స్థాపకులు: నెల్లూరు వెంకట్రామానాయుడు
సంపాదకులు: నెల్లూరు శ్రీరామమూర్తి

# జమీన్‌రైతు

సంపుటి:76 సంచిక:4 28.1.2005 శుక్రవారం 12పేజీలు విడిప్రతి : రూ.3.00

డి.ఆర్. ఉత్తమలో విందుల పసందు

♦ బర్త్‌డే పార్టీలు, ఎంగేజ్‌మెంటు ఫంక్షన్లు, వివాహాలు తదితర శుభకార్యాలకు, కార్పొరేట్ మీటింగులు, సెమినార్లు, గెట్ టుగెదర్లు మరియు కాన్ఫరెన్స్‌లకు అత్యాధునిక వసతులతో, అన్ని హంగులతో బేంక్వెట్ హాల్స్ (అన్ని రకముల ఎలక్ట్రానిక్ - సౌండ్, మ్యూజిక్, వీడియో పరికరములతో సహా)

♦ ప్రతి రోజూ వివిధ రకాల వెజ్ & నాన్‌వెజ్ స్పెషల్ బఫే లంచ్ రూ. 160/-లకే

మరిన్ని వసతులతో మీకు స్వాగతం పలికే
మీ డి.ఆర్. ఉత్తమ ★ ★ ★ హోటల్

DR UTTHAMA HOTEL

23/976, Dhandayudha Puram, Nellore - 3. Phones : 2317777 - 10 Lines

### పరిటాల రవి దారుణ హత్యతో...

# రాక్షసావతారమెత్తిన రాజకీయం!

పరిటాల రవి హత్యతో రాష్ట్ర రాజకీయాలు ఒక్క సారిగా ఉడుకెత్తి పోయాయి. ప్రభుత్వ, ప్రతిపక్షాల మధ్య తీవ్రమైన శత్రు భావనలు రేకెత్తించింది దారుణ సంఘటన. సూరి అనబడే మద్దెలచెరువు సూర్యనారాయణ రెడ్డికి, పరిటాలకు మధ్య ఎట్లా పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటుందో - రాజశేఖరరెడ్డి, చంద్రబాబుల మధ్య కూడా అంతే ఉప్పులో నిప్పుగా తయారయ్యింది పరిస్థితి. ముఖ్యమంత్రి దృష్టిలో ఇదొక మామూలు ముఠా నేత మరణం మాత్రమే. కానీ చంద్రబాబు నాయుడు కోణంలో ఇది తమ తెలుగు దేశం పార్టీని కర్కశంగా అణిచి వేయడానికి పన్నిన పథకంలో ఒక భాగం. ఈ హత్యతో తనకేమీ నిమిత్తం లేదు; రవి ప్రత్యర్థులే అవకాశం దొరకగానే కసి తీర్చుకున్నారు అనే ధోరణిలో తేలికగా తీసివేయడానికి ప్రయత్నిస్తున్నారు ముఖ్యమంత్రి. కానీ చంద్రబాబు అట్లా భావించడం లేదు. రాజశేఖరరెడ్డి కుమారుడు జగన్‌మోహనరెడ్డి ప్రేరణతో, పోలీస్ ఐజి ఆర్‌పి మీనా సహకారంతో, మంత్రి జెసి దివాకరరెడ్డి భాగస్వామ్యంతో, పోలీసు కానిస్టేబుళ్ల చేతనే చంపించారని చంద్రబాబు అనుమానిస్తున్నాడు. ప్రభుత్వ శక్తులన్నీ ఒక వ్యక్తి హత్యకు చేతులు కలిపి పని చేయడమనేది మహా ప్రమాదకర విషయం కాబట్టి; ఈ ధోరణిని అరికట్టకుంటే ఆ వరస తమలోని తతిమా నేతలపైకి కూడా ప్రసరిస్తుందన్నది ఆయన భయం.

ఎన్టీరామారావు అధికారంలో వున్నప్పుడు జరిగిన వంగవీటి మోహనరంగ హత్య సమయంలోనూ ఇదే రకమైన రాజకీయ భయానక పరిస్థితి నెలకొన్నది. దాని మూల్యం 1989ఎన్నికలలో భారీగానే చెల్లించింది తెలుగుదేశం పార్టీ. రామారావు గారే స్వయంగా ఒక అసెంబ్లీ స్థానంలో ఓడిపోయాడానాడు. పరిటాల రవి విషయంలో కాంగ్రెస్ పార్టీకి అదే మోస్తరు అనుభవం ఎదురౌతున్నదిప్పుడు. ఈ దుర్ఘటనను ప్రజలు ఎంత వరకు రాజకీయ దృక్పథంతో పరిశీలిస్తున్నారో; భావిస్తున్నారో ఏదో ఒక ఎన్నిక అంటూ జరిగితే తప్ప అర్థం కాదు. ప్రజల అభిప్రాయాలు ఎప్పుడూ నిశ్శబ్దంగా వుంటాయి. అవి వెలికి వచ్చేది ఎన్నికల సమయంలోనే.

> ***ప్రభుత్వ, ప్రతిపక్ష నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్పర్థలు పెరగడం; పాలకుల చేతిలో తమ ప్రాణాలకు ముప్పు తప్పదన్న భీతి ప్రతిపక్షీయులకు కల్గడం ప్రజాస్వామ్యానికే ప్రమాదం కల్గించే పరిణామాలు!***

పరిటాల రవి ముఠా నేత అన్న మాటలో అసత్యం ఏమీ లేదు. ముఠా నేతలకే నేత వంటి వాడాయన. అనంతపురం జిల్లాలో ఆయన అరాచకాలను గ్రంథస్తం చేయదలిస్తే - మహాభారత మంత ఉద్గ్రంథం తయారౌతుంది. కథలు, పిట్ట కథలు, ఉప కథలతో వేల పేజీలకు విస్తరింప చేయవచ్చు ఆయన నేర చరిత్రను. ఆయన చేతిలో బాధలు పడిన వారు, ఆయన కన్ను పడి మాడిమసై పోయిన వారు, ఆయన చేత చావు ముహూర్తాలు పెట్టించుకున్న వారు వందల సంఖ్యలో వున్నారు. అటువంటి బాధితులలో ఒకరు కానీ, నలుగురైదుగురు కలిసి కానీ ఈ హత్య చేసి వుంటారనడంలో సందేహం లేదు. ప్రత్యర్థులను మట్టుబెట్టడంలో పరిటాల రవి మేధస్సు, తెలివి, ప్రణాళికా పటిమ అమోఘమని చెప్తారు. తాడిని తన్నే వాడున్న చోట, వాడి తల దన్నే వాడూ వుంటాడని నిరూపించారు ఆ ప్రత్యర్థులిప్పుడు. హత్య జరిగిన తీరు చూస్తే ఏదో సినిమా కథ వలె కన్పడుతున్నదే తప్ప నిజ జీవితంలో జరిగినట్లు లేదు. అనుక్షణం తనను తాను వెయ్యి కళ్లతో, వందకు తగ్గని అంగరక్షకులతో కాపాడుకోవడానికి ప్రయత్నించే పరిటాల రవి అంత సులభంగా, అంత నిస్సహాయంగా హంతకులకు దొరికి పోతాడని ఎవరూ కలకూడా కని వుండరు. ఆ హంతకులు కూడా వందలాది జనం, విఐపి గన్‌మెన్‌లు, పోలీసులు చూస్తూ వుండగా, జేబులో నుంచి తుపాకులు తీసి, ఒకటికి పది సార్లు కాల్చి, బాంబులు వేసి, రవి చనిపోయిందీ లేనిదీ నిర్ధారించుకుని, నింపాదిగా వెళ్లిపోవడం మరీ ఆశ్చర్యం కల్గించే విషయం. చావు మూడితే ఎంతటి వాడూ తప్పించుకోలేడన్న కర్మ సిద్ధాంతానికి ఇంతకంటే వుదాహరణ వేరొకటి అవసరం లేదు.

ఈ హత్య ఇంత పకడ్బందీగా జరగడం వల్లనే చంద్రబాబు నేరుగా ముఖ్యమంత్రిని, ఆయన కుమారుడు జగన్‌మోహనరెడ్డిని శంకిస్తూ ఆందోళన చెందుతున్నాడు. పరిటాల రవి వార్త ఏ స్థాయిలోని తెలుగుదేశం వాది కూడా జీర్ణించుకోలేని పరిణామం. ఆ వార్త వారిని కలవరపరచడంలో, నివ్వెర పరచడంలో వింత ఏమీ లేదు. ఆ పార్టీతో ఆయన అనుబంధం అటువంటిది. ఆయన ఒక అసాంఘిక శక్తి అన్న విషయం చంద్రబాబుకు కూడా తెలుసు. కానీ అనంతపురం జిల్లాలో ఆయన లేకుంటే తమ పార్టీకి వునికే మిగలదన్న నిజం కూడా తెలుసు. రవి ప్రాణాలకే దిక్కు లేనప్పుడు, ఇక తతిమా తెలుగు దేశంవాదుల బ్రతుకులకు గ్యారంటీ ఏమి వుంది అన్న ఆందోళన చంద్రబాబుతో సహా తెలుగుదేశం వాదులందరినీ కలవర పెడుతున్నది. వరంగల్ దయాకరరావు వంటి కీలక నేతలు పది మంది వరకు ఇదే ప్రకారం నిహతులై పోతారన్న భయం వారికి పీడ కలలు తెప్పిస్తున్నది. ఆ ప్రమాదాన్ని కాచుకోవడం ఎట్లా అన్న ఆందోళనతోనే రవి హత్యపై అంత రచ్చ చేస్తున్నారు చంద్రబాబు. తెలుగుదేశంలో వుంటే ప్రాణానికి రక్షణ లేదు అన్న భీతి కార్యకర్తలలో ఏర్పడితే పార్టీ నిర్వీర్యమై పోతుందన్నది భయం.

> ***జెసి., మీనా, జగన్‌లను కేసు నుంచి తప్పించే ప్రయత్నం ద్వారా తన నిష్పాక్షికతను నిరూపించుకొనే అవకాశాన్ని పోగొట్టుకున్నాడు ముఖ్యమంత్రి! బస్సుల విధ్వంసంతో ప్రజల ఈసడింపుకు గురైనాడు చంద్రబాబు.***

నిజంగా ఆ పరిస్థితే వుంటే మాత్రం అది ప్రజాస్వామ్యం కాజాలదు. రాజకీయ ప్రత్యర్థులను హతమార్చడం ద్వారా బలం పెంచుకోవడానికి ఇదేమీ లాలు ప్రసాద్ బీహార్ కాదు. నాగరికత, సభ్యత, సంస్కారం, ప్రజాస్వామ్య సాంప్రదాయాలు పాటించే ఆంధ్రప్రదేశ్‌లో అంతటి అరాచక రాజ్యం వస్తుందని భావించడం పొరపాటు. అయితే రవి హత్య ఆ భీతావహ వాతావరణం సృష్టించింది అన్న మాట మాత్రం వాస్తవం. ఆ

తరువాత 6వ పేజీలో

కోస్తా ప్రాంతాల అన్ని రకాల కట్టడాలకు అనువైనది... అత్యంత పటిష్టమయినది... శక్తి వంతమైనది...
కరోజన్, క్లోరైడ్స్ మరియు సల్ఫేట్ తాకిడి నుండి మీ ఇంటిని సురక్షితంగా కాపాడేది...



పెన్నా సిమెంట్ వారి
పెన్నా సురక్ష ™

Penna Cement Industries Limited
Plot No. 703, Sriniketan Colony, Road No. 3, Banjara Hills, Hyderabad- 500 034. Phone: 91-40-23353945, 23353950, 23353952
Fax: 91-40-23353951 Website: www.pennacements.com, E.mail: marketing@pennacements.com

# పరిటాల అర్జునుడా

12వ పేజీ కొరవ

ప్రజలలో చైతన్యం తెచ్చాడు. భూపోరాటాలు జరిపాడు. కొన్ని వేల ఎకరాల శివాయి భూములను ఆక్రమించి పేదలకు పంచిపెట్టాడు. దానితో ఆయనకు ఆ గ్రామాలలో గొప్ప పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. అదే సమయంలో భూస్వాముల కన్నెర్ర కూడా తప్పలేదు. ఇప్పుడు రవి హత్యకు కుట్ర పన్నినట్లుగా అనుమానిస్తున్న మద్దెలచెరువు సూరి తండ్రి నారాయణరెడ్డి - శ్రీరాములు ఒక కేసులో కోర్టుకు హాజరై బస్సులో తిరిగి వస్తుండగా కిరాతకంగా చంపించాడు. అప్పటి వరకు రవి కుటుంబానికి ముఠాలతో సంబంధం లేదు. ఫ్యాక్షన్ నేపథ్యం లేదు. తమ తండ్రి హత్యకు ప్రతీకారం తీర్చుకోవడానికి రవి సోదరుడు హరి పీపుల్స్ వార్‌ను ఆశ్రయించాడు. అయితే ఆ కోరిక తీరక ముందే పోలీస్ ఎన్‌కౌంటర్‌లో హతమై పోయాడు. ఆ తర్వాత వంతు రవికి వచ్చింది.

అయితే రవి ఎప్పుడూ నక్సలైట్ దళాలతో పనిచేయలేదు. కానీ నక్సలైట్లతో సంబంధాలు మాత్రం పుష్కలం. తనకు ఆశ్రయం కావాలంటే వారి వద్దకు వెళ్లేవాడు; వారు అజ్ఞాతంలో గడపవలసి వచ్చినప్పుడు తన గ్రామంలో చోటు ఇచ్చేవాడు. తన సోదరుడు చేయలేని పనులు చాలానే పూర్తి చేశాడు రవి. తండ్రి హత్యకు కారకుడైన నారాయణరెడ్డిని హతమార్చాడు. ఆయనకు సహకరించిన చెన్నారెడ్డిని చంపించాడు. వారి అనుచరులు చాలా మంది రవి చేతిలో హతమైనారు. వీటన్నిటి కంటే కీలకమైన హత్యలు - చెన్నారెడ్డి కుమారులు - ఎస్‌వి రమణారెడ్డి, ఓబులరెడ్డిలవి. అరాచక శక్తి అనే పదానికి నిర్వచనంగా ఓబులరెడ్డిని పేర్కొన వచ్చునని ప్రతీతి. తనకు గిట్టని వారిని హింసించడం, కొట్టడం, చంపడం, కిడ్నాప్ చేయడం వంటివి అతగాడికి మామూలు విపయాలట. ధర్మవరం టౌన్‌లో కంటికి నదురుగా కన్పడిన ఏ ఆడపిల్లనూ వదలి పెట్టేవాడు కాదంట. ఒకరోజు కొత్తగా ధర్మవరానికి వచ్చిన ఒక ప్రభుత్వ ఇంజనీరు భార్య బజారులో కూరలు కొంటూ కనపడింది. ఆ దారిన పోతూ ఆమెను చూసిన ఓబులరెడ్డి ఆమెను బలవంతంగా జీపులో ఎక్కించుకుని, ఇంటికి తీసుకవెళ్లి మానభంగం చేశాడట. ఆ ఇంజనీరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోలేదు. ఊర్లో పెద్దలెవరికి చెప్పినా జోక్యం చేసుకోలేదు. దానితో నేరుగా తానే ఓబులరెడ్డి ఇంటికి వెళ్లి బ్రతిమలాడారుట. అయితే ఓబులరెడ్డి ఆమెను తిరిగి పంపడానికి ఇష్టపడలేదు. నాకు ఇంకా మోజు తీరలేదు, తీరిన తర్వాత పంపుతాను అని అతడిని కొట్టి తరిమేశాడట. పాపమా ఇంజనీరు ఆత్మహత్య చేసుకున్నాడు. ఒక వారం తర్వాత ఆమెను వదలి పేశారట. ఆ యువతి కూడా బయటకు రాగానే ఆత్మహత్యకు పాల్పడింది. అంతటి దుర్మార్గాలకు అలవాటు పడిన భూస్వాములను ఒకరొకరిగా చంపించాడు పరిటాల రవి. దానితో ఆయనకు సాధారణ ప్రజలలో విపరీతమైన అభిమానం పెరిగింది. పైపెచ్చు సామాన్యులు ఎవరు తన దగ్గరకు వచ్చినా వారితో ఆప్యాయంగా మాట్లాడడంతో పాటు, వారు అడిగిన పనుల్లా చేసి పంపేవాడట. ఆయన ఇంట్లో ప్రతిరోజూ కనీసం రెండు వందల మందికి తక్కువ కాకుండా భోజనం చేసేవారట. సంవత్సరానికి ఒకసారి తన గ్రామంలో వెయ్యి మందికి ఒకసారి సామూహిక వివాహాలు జరిపించేవాడు. ఇటువంటి సంఘటనలన్నీ రవి పట్ల ఆ పరిసర గ్రామాలలో ప్రేమను పెంచాయి.

అయితే అదే సమయంలో పరిటాల రవి రాష్ట్రంలోనే పెద్ద మాఫియా డాన్‌గా ఎదిగాడు. హైదరాబాదు, కర్నూలు, విశాఖపట్నం వంటి దూర ప్రాంతాలలో కూడా ఆయనకు అనుచరులు కొందరు, ఆయన పేరు చెప్పుకుని మరికొందరు భూఆక్రమణలు, కాంట్రాక్టు మధ్యస్తాలు, ఇళ్లు ఖాళీ చేయించడాలు, అప్పులు వసూలు చేసి పెట్టడాలు, రౌడీ పంచాయితీలు వంటి వాటన్నింటికీ పాల్పడ్డారు. వివాదాలలో చిక్కుకున్న వారి వద్దకు వచ్చి రవి పేరు చెప్తే చాలు, సమస్య ఇట్టే పరిష్కారమై పోయేంత భయానక వాతావరణం సృష్టించాడు రవి. మరొక ప్రక్క ఆయన చేసిన ముఠా పోరాటం అనంతపురం జిల్లాలోనే కాక, తతిమా జిల్లాలలో కూడా కుల పోరాట రూపు సంతరించుకున్నది. కమ్మ కులానికి రక్షకుడిగా, ఆత్మబంధువుగా అవతారమెత్తాడాయన. ఆయన హత్య ఆ కులం వారందరిలో తీరని ఆవేదన రగిలించడానికి కారణం అదే.

అయితే రవిని చూసిన వారు, మామూలు సందర్భాలలో మాట్లాడిన వారు మాత్రం అతడి లోపల ఇంతటి కర్కశ నేర స్వభావి దాగి వున్నాడని పసికట్టనే లేరు. ఎంతో సంస్కారయుతంగా వుంటాయి మాటలు. అంతటి హింసాయుత జీవితం గడిపిన రవి తన కుమారుడికి గౌతమ బుద్ధుడి పేరు పెట్టుకోవడం ఆయనలోని ద్వైదీభావన మానసాన్ని సూచిస్తుంది.



నెల్లూరు కార్పొరేషన్‌లో పన్నులు బాగా వసూలు చేసినందుకు రెవిన్యూ అధికారి హుమయూన్‌కు రిపబ్లిక్ దినోత్సవం రోజున ప్రశంసాపత్రాన్నిస్తున్న కలెక్టర్ రాజశేఖర్. జెసి శ్రీధర్, కమీషనర్ ఉమాపతి ప్రక్కనున్నారు.

రవి మరణం అనంతపురం ముఠా కక్షలకు చరమగీతం పాడుతుంది అనుకోవడం భ్రమ. ఆయనకు సరైన వారసులు లేని మాట నిజమే. కానీ ఆ బాధ్యతను స్వీకరించేవారు ఎవరైనా సరే వారికి తమ సహకారం అందజేయడానికి రాష్ట్రమంతా రవి అభిమానులు వున్నారిప్పుడు. నక్సల్‌లో కూడా రవి సానుభూతిపరులు చాలా మందే వున్నారు. వారి దృష్టిలో రవి చేసిన లేదా చేయించిన హత్యలలో సగ భాగం సమాజ శ్రేయస్సుకు వుపకరించేవి కావడమే అందుకు కారణం.


# ఫ్లెమింగో ఫెస్టివల్

**2005 జనవరి 28 నుండి 30 వరకు**

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణము, సూళ్ళూరుపేట,
నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా




**కార్యక్రమాలు**

❊ విదేశీ విహంగ వీక్షణ పర్యటనలు ❊ పడవ పందెములు ❊ మత్స్యకారుల వస్తు ప్రదర్శన ❊ ఆటల పోటీలు
❊ పశు ప్రదర్శన ❊ ఫోటో ప్రదర్శన ❊ ట్రేడ్‌ఫేర్ అండ్ ఎక్స్‌పో ❊ సాంస్కృతిక కార్యక్రమాలు ❊ పుష్ప ప్రదర్శన

**పులికాట్, నేలపట్టు, షార్ మరియు ఇతర పర్యాటక స్థలాలను సందర్శించండి.**

విదేశీ వలస పక్షులైన ఫ్లెమింగో, పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ తదితర పక్షులను వీక్షించి ఆనందించండి. పడవ విహార యాత్రలు, చేపల వేటలు, చేనేత వస్త్రాల కొనుగోలు మరియు ప్రత్యేక ప్రదర్శనలను తిలకించి మధురానుభూతి పొందండి.





బి. రాజశేఖర్, ఐ.ఎ.ఎస్
జిల్లా కలెక్టర్ మరియు అధ్యక్షులు
ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వాహక కమిటీ, నెల్లూరు

ఇతర వివరములకు : డివిజనల్ అటవీశాఖాధికారి, సూళ్ళూరుపేట, ఫోను నెం.: 08623 - 242158 ఉ॥ 6 గం॥ నుండి రాత్రి 10గం॥ వరకు
e-mail : flamingofestival@yahoo.com web: www.nelloredistrict.com

